# కోకిలమ్మ గుడి



కాలం ఎంత మారినా ఆడవాళ్ళు రాజస్థాన్‌లోనూ మరికొన్ని చోట్లా సతీ సహగమనంతో దేశాన్ని అల్లకల్లోలం చేస్తున్నా భారతకాలంలో తప్పుచేసా నన్నే న్యూనతాభావంతో మాద్రిలాటివాళ్ళు ఆత్మ హననం చేసుకున్నా యీ దేశంలో సహగమనం అనేది యిటీవల అంటే మధ్యయుగాల్లో ప్రారంభ మైన మహాఘోర చర్య.

అయితే యిటీవల ఒక మారుమూల వూళ్ళో ప్రతి వేసవికాలం లాగానే అగ్ని హోత్రుడు తన ఆడంబరాన్ని చూపిస్తూ వూరంతా భక్షించాడు. సర్వభక్షకుడైన అగ్నిదేవుణ్ణి ఆపటానికి ఆ ప్రాంతాల్లో నీళ్ళు కూడా లేవు.

అదలా వుంచితే ఆ వూరికి కొత్త కోడలుగా వచ్చిన కోకిలమ్మ అందం అపురూపమని వూళ్ళో సర్వప్రజలూ అంగీకరించారు. ఆమె నడిస్తే నాట్యంలా వుంటుందనీ, కళ్ళెత్తితే కనకాభిషేకాలు కురుస్తాయనీ ఆ వూరి కుర్రకారు నిశ్చయించుకుని ఆమె చూపుకోసం వెంపరలాడటం ప్రారంభించారు. ఆమె అందం సహజంగానే వూరి నాయకుణ్ణి ఆకర్షించింది. కోకిలమ్మ భర్త కేశవరావుకి యీ విషయం గ్రహింపుకువచ్చినా చేసేది ఏమీ లేక తనలో తనే మధనపడి ఫలితం దేవుడికి వదిలేసి వూరుకున్నాడు. ఇంట్లో పక్షవాతపు తండ్రీ, కళ్ళు కనపడని తల్లీ అవటంవలన యింటి పని అంతా కోడలు కోకిలమీదే పడ్డది. అందులో బయటకు వెళ్ళి నీళ్ళు తేవాల్సిన బాధ్యత ప్రధానమైనది. ఊరు చెరువు, ఊరు దాటింతరువాతనే వుండటంతో యింట్లో బోరింగులూ, బావులూ లేని ఆడవాళ్ళు ఆ చెరువుకి వెళ్ళక తప్పేది కాదు. అక్కడికీ కేశవయ్య కావడి వేసుకుని పశువులకీ మొక్కలకీ నీళ్ళుతెచ్చినా మంచినీళ్ళు వగైరాలు కోకిల వంతుకే వచ్చేవి. ఎండైనా వానైనా యీ కార్యక్రమం ఆడవాళ్ళకు తప్పేది కాదు. నీటి కరువు సంవత్సర సంవత్సరానికీ ఎక్కువవటంతో చెరువునీటికి కూడా కరువు ఎక్కువ అయింది. ఆ చెరువులోనే ఒక పక్కన పశువులు నీళ్ళు తాగటం, మరోపక్క బట్టలు వుతకటం, యింకో పక్క యువకులు ఆడవాళ్ళని చూడాలనే యావతో చెరువుకెళ్ళి అక్కడే ఒకగంట సేపు మొహం కడిగి మరోగంట సేపు చెరువులో ఈతలు కొట్టటం వూరి పెద్దలూ, ఒకరిద్దరు సత్పురుషులూ ఆపలేని దౌర్భాగ్యం. ఆడవాళ్ళు కూడా ఆ చెరువులోనే స్నానాలు చెయ్యటం తప్పనిసరిగా జరుగుతూవున్నది. అక్కడికీ కోకిలమ్మ వేళ తప్పించి వెడుతూవుండేది. ఆమె కోసమే ఆ యువకులు ఎదురుచూస్తూ వుండేవాళ్ళు. అందులో ముఖ్యుడు యువసేన అధ్యక్షుడు పట్టపగ్గాలు లేని మదోన్మత్తుడు. పేద బ్రాహ్మణి పెళ్ళానికి యింత అహంకార మేమిటనే దురహంకారి. ఇటీవల మగజాతి పరమ నైచ్యంగా తయారయిందంటే.... మగవాళ్ళు నన్ను క్షమింతురుగాక. పత్రికల్లో తెల్లారి లేస్తే కూతుర్ని చెరిచిన తండ్రి, పసిపిల్లని చెరిచిన తాతలాటి వార్తలు చదవటానికి చాలా అసహ్యంగా కనబడుతున్నాయి. యనభై యేళ్ళ స్త్రీని చూచినా మగవాడికి సెక్సే జ్ఞాపకం వస్తోందంటే యీ దేశం ఎంత పాపం చేసుకుందో. ఇక్కడ రాముడు పుట్టాడా? ఋ ఋ డు జన్మించాడా అని అనుమానించాల్సి వస్తోంది.

కోకిలమ్మ పుట్టింటివారు శాస్త్ర నీతి, ధర్మం పాటించే కుటుంబం. తల్లి తర్ఫీదువల్ల కానీ తండ్రి బోధలవల్ల కానీ కోకిల యింకొక మగవాణ్ణి కన్నెత్తి చూట్టం తప్పు అనే అభిప్రాయం పెంచుకున్న అమాయకురాలు. ఈ యువకుల పాపపు కామపు చూపుల్ని తలవంచుకు భరించటం అలవాటు చేసుకుంది. ఆ చెరువు గట్టునే ఒక పాడుబడ్డ అమ్మవారి గుడి ఆ ఊరుకు చెందిందో పక్కవూరుకు చెందిందో తెలియక పూజాపునస్కారాలు లేనిది. ఆ గుళ్ళోవున్న దేవత స్త్రీ దేవత మాత్రం అవును. ఆ వూరి వృద్ధుల కథలప్రకారం ఆ దేవత చాలా మహిమ కలది.

కోకిల అత్తగారు ఆ దేవత మహిమల్ని గురించి కోడలుకి కథలు కథలుగా చెపుతూవుండేది. ఆ కారణంవల్ల కాస్త పసుపూ కుంకుమా కొంగున కట్టుకువెళ్ళి ఒక బిందెడు నీళ్ళు అమ్మవారిమీద పోసి పసుపు కుంకుమతో తోచినట్లు అలంకరించి పిచ్చిపూలు నాలుగు ఆ విగ్రహం పాదాలమీద వుంచటం కోకిల దినచర్య.

కాలం యిలా జరుగుతుండగా కోకిల గర్భవతి అయింది. అలాగే గర్భభారంతో నీళ్ళు తెస్తూ తన చిన్న యీ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుండేది ఆమె. చెరువులో నీళ్ళు తెచ్చుకునే మగవాళ్ళకుగాని ఆడవాళ్ళకుగాని దక్షిణాభిముఖంగావున్న ఆ పాడుపడ్డ గుళ్ళో ఏం జరుగుతుందో కనపడదు.

కోకిల దినచర్యని జాగ్రత్తగా గమనిస్తున్న యువనాయకుడు గుడికంటె పటిష్టమైన ప్రదేశం మరొకటి లేదని నిర్ణయించుకుని అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

కేశవయ్య భార్య చేసే యీ పిచ్చి పూజని అవుననిగాని కాదనిగాని అనలేదు. అత్తగారు మాత్రం అమ్మవారి గుడిలోకివెళ్ళి వచ్చావా అని తప్పకుండా అడుగుతూ వుండేది. ఆవిడకు తెలిసి తన చిన్నతనంలో మగజాతి అక్కా, కోడలా, అత్తా అని పిలుస్తూ గౌరవించటం జరుగుతూవుండేది. అందురాలైనా కాలం మారిందని గ్రహించింది కాని అది ఎంతగా మారిందో ఆ అంధురాలికి తెలియదు. మామగారు మాత్రం గొణుగుతూనే వుండేవారు. ప్రస్తుతం కోడలు గర్భవతిగా వుండటంవలన వాళ్ళకు చాలా అనుమానాలు తీరి యిక భరవాలేదు. వూరి కుర్రాళ్ళు గర్భవతి అని వూరుకుంటారు అని తనలో తామే నిర్ణయానికొచ్చారు.

కాలం రాక్షసమైనదనీ, యిప్పుడు తిరుగుతున్న వాళ్ళు మనుషులు కారు మహమ్మారులనీ పాపం వాళ్ళు గ్రహించలేకపోయారు.




రోహిణీ కార్తె ప్రవేశించింది. చెరువులో నీళ్ళు మూడువంతులు యింకిపోయినయి. మెట్లు దిగి చెరువులో కొంతదూరం నడిస్తేతప్ప నీళ్ళు అందటం లేదు. గర్భ భారంతో, ఘట భారంతో కోకిల తన దినచర్యని యధావిధిగా సాగిస్తూనే వుంది.

ఒకరోజు నీళ్ళతో అమ్మవారి విగ్రహాన్ని కడిగి పసుపు కుంకుమతో అలంకరించి పూలతో "అమ్మా! నీ పేరేమిటో తెలియదు గాని ఆడ పిల్ల పుడితే నీ పేరు పెట్టుకుంటాను'' అని మొక్కుకుంది కోకిల.

అతి శ్రమవల్ల ఆమె గుడిలో గోడకానుకుని కూర్చుండిపోయింది. యువ నాయకుడు వారుణ వాహినిలో మునిగి తేలి చెప్పులు దూరంగా విప్పి గుళ్ళోకి జొరపడ్డాడు. కోకిల కళ్ళుమూసుకుని ఏదోనెలనే నొప్పులొస్తున్నాయా అని ఆలోచిస్తూ నడుము రాచుకుంటూ కూర్చున్న చోటనే వాలిపోయింది. అప్పుడు ప్రవేశించిన వారుణ వాహినీ కీచకుడు చెప్పకుండా, అడక్కుండా భయంకరంగా ఆమె మీదపడి అమ్మవారి కళ్ళ ఎదుటే ఆమెను భయంకరంగా చెరిచాడు. కులనిధులింక లేదు. సూర్యుడు గతులు తప్ప లేదు. భూమి బీటలు విచ్చలేదు. కాని ఆమె చీరంతా రక్తసిక్తమైపోయింది. స్పృహ వుండీ లేనట్లుంది. రక్తం మెల్లగా కాలువలగట్టి అమ్మ వారి పాదాల దగ్గరకు చేరుతోంది. బహుశా ఆమె రక్తబీజు కావచ్చును. ఒక్క తడవ వూళ్ళో ప్రతి యిల్లూ అంటుకుంది. దౌర్భాగ్యుడైన ఆ తెలుగు యువనాయకుడు తృప్తిగాలేచి రక్తంలో కాలుజారి అమ్మవారి ఎదుట నేలలో పాతేసివున్న శూలంమీద పడిపోయినాడు. ఇది చూసిన కోకిల ఆ తల్లికి దండంపెట్టి రక్తవస్త్రాలతో తూలుతూ ఊరి సమీపానికివచ్చి వూరి మొదట్లో మండి పోతున్న ఒక మహాగ్నిలోకి సరాసరి నడిచింది.

పచ్చగడ్డి మోపు ఎత్తుకువస్తున్న కేశవయ్య యీ భయంకర దృశ్యాన్ని చూసి జరిగింది గ్రహించాడు. వృద్ధులైన తలిదండ్రుల్ని క్షమించమని మనసులోనే ప్రార్థించి భార్యను రక్షించు కుందామనో లేదా చనిపోదామనో తెలియదు గాని ఆ మంటల్లోకి నలుగురూ అరుస్తున్నా వినిపించు కోకుండా వెళ్ళాడు. రక్తవస్త్రాలు మొదట్లో తొందరగా అంటుకోకపోయినా తరువాత అంటు కున్నాయి. నిలువునా మండిపోతున్న కోకిల భర్తనుచూసి జరిగింది రెండుముక్కల్లో చెప్పింది. అతను ఆ భార్యను బయటకు తీసుకురావచ్చుకాని ఆ పనీ చెయ్యలేదు. తనూ బయటకు రావచ్చు. ఆ పనీ చెయ్యలేదు. భార్యతోపాటు నిలువునా అతనూ కాలిపోయినాడు.

ఇదంతా చూస్తున్న ఒక వృద్ధ స్త్రీ "నాయనా! ఆడవాళ్ళు సహగమనం చెయ్యటం విన్నాం, చూడకపోయినా. నువ్వు నీ భార్యతో సహగమనం చేసావురా తండ్రీ,'' అని ఏడుస్తూ గోలపెట్టింది.

మొత్తం వూరు అంటుకోవటంవల్ల ఎవరి గోలలో వాళ్ళు వున్న జనం యీ విషయం పట్టించుకోలేదు. నాలుగు రోజులు గడచిన తరువాత వృద్ధ జంగం ఒకడు ఆ అమ్మవారి గుడిలోకి వెళ్ళి శూలం మీద చచ్చి దుర్వాసన కొడుతున్న యువ నాయకుణ్ణి చూసాడు. అక్కడ అమ్మవారి కళ్ళలో నుంచి రక్తంకారి ఎండి వుంది. శూలంమీద పడ్డ యువనాయకుడి రక్తం అమ్మవారి కళ్ళలో పడ్డదో లేక నిజంగానే అమ్మవారు రక్తకన్నీరు కార్చిందో ఆ జంగానికి అర్థంకాలేదు. పరుగెత్తుకుంటూ బయటకు వచ్చి పై విషయం తెలిసిన వృద్ధురాలి దగ్గిర కోకిల రక్తాంబరాలతో నిలువునా మండి పోవడం, ఆమె భర్త కూడా ఆమె చెయ్యి పుచ్చుకుని నుంచునే మండిపోవడం విని యిదొక విచిత్ర కథ "అవ్వా! యిదొక పతీ సహగమనం. ప్రేమికులైన దంపతులు చేసిన మృత్యు ప్రయాణం. అమ్మవారి గుళ్ళో శూలంమీద ఒక శవం వుంది. నేనెంత శివనామం జపిస్తూ ఎన్ని వూళ్ళు తిరిగినా దేవుడున్నాడని అనుకోలేదు. దేవుడున్నాడమ్మా. దేవుడున్నాడు. యీ దేశంలో సతీసహగమనాల్ని గురించే చెప్పుకుంటారుగాని, యువకుడూ సత్పురుషుడూ అయిన మగవాడు ప్రేమించిన సతితో సహగమనం చేస్తాడని చాలామందికి తెలియదు. అమ్మవారి కళ్ళు భగ్గుమనటం వల్లనే వూరు అంటుకుంది. తల్లీ, చెల్లీ, కూతురు అయిన స్త్రీని అవమానించిన ఏ వూరయినా అంటుకుంటుంది, ఆ వూళ్ళో దేవత వుంటే ఆ దేవతకు మహిమ వుంటే వూరంటుకుంటుంది. యీ వూరి వాళ్ళకి యీ మండిపోయిన వూరి వాళ్ళకి బుద్ధుంటే శారీరికంగా బలహీనురాలైన స్త్రీకి దైవబలం వుందని గ్రహిస్తారు. పతివ్రతని చెరిచిన పాపం వూరికేపోదు'. అని తన దారిన తను వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఆ వూరికి రాజకీయనాయకులూ, మహిళామణులూ, సమాజసేవకులూ వచ్చారు కాని గాలి కూడా లేకుండా ప్రతియిల్లూ ఒక్కసారే ఎలా అంటుకుందో వూరి యువనాయకుడు శూలంమీద పడి ఎందుకు చచ్చాడో, అమ్మవారి కళ్ళకు ఎండిపోయిన రక్తం ఎందుకు వుందో వాళ్ళు విచారించలేదు. ఒకళ్ళిద్దరు పత్రికా విలేఖరులకు ఏవో అనుమానాలు వచ్చినా రుజువులు లేక వాళ్ళూ వూరుకున్నారు. ఆ విధంగా కేశవయ్య పతీ సహగమనం అజ్ఞాతంలో వుండిపోయింది. వూరి దేవత వూరిని తగలబెట్టిందన్న వూహ ఎవరికీ రాలేదు. అయినా యిలాటి కధలన్నీ ఉత్త అబద్ధాలు, జరగవు అని హేతు వాద సంఘం వారు ముసలమ్మ మాటల్ని కొట్టేసి తను పేర్లు ఘనంగా పేపర్లో వేయించుకున్నారు.

యిదంతా చూసిన ముసలమ్మ మాత్రం కేశవయ్య దంపతులు చనిపోయిన చోట రెండు తులసి మొక్కలు పెంచుతోంది. యిప్పటికీ అమ్మవారి గుడి ప్రాంతానికి పిరికి గుండెవాళ్ళు వెడితే శూలం మీదపడి వెర్రికేక వేసిన యువనాయకుడి కేక స్పష్టంగా వినపడుతుంది. ఆ రోజునుంచీ ఆ గుడికి కోకిలమ్మ గుడి అని పేరు పెట్టింది ఆ ముసలమ్మ. ■